ప్రజాశక్తి

గురువారం 17 అక్టోబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ప్రజా సమస్యలపై..

చిత్తశుద్ధితో పనిచేయండి

◆ జల్ జీవన్ పనులపై దృష్టి సారించండి

◆ స్థాయీ సంఘ సమావేశాల్లో అధికారులకు జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర ఆదేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగాయి. గ్రామీణాభివృద్ధి, జల వనరులు, గనులు, ప్రజా రవాణా, ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశాల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు వేయగా ఆయా శాఖల అధికారులు బదులిచ్చారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

సుభద్ర మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు చెందిన బిల్లులు చెల్లించలేదని, ఇదివరకే దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొత్త గృహాలు మంజూరు కాలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వాటిని మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం కింద మంజూరు చేసిన గృహ పథకాలు కొనసాగుతాయని, పెండింగ్‌లో ఉన్న గృహ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం కూడా జరుగుతుందని అధికారులు ఛైర్‌పర్సన్‌కు వివరించారు. గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులపై ఆరా తీసిన ఆమె జెడ్‌పిటిసిలకు సమాచారం ఇవ్వాలని అన్నారు. దీనికి అధికారులు బదులిస్తూ ప్రతి గ్రామసభలో తీర్మానం చేసిన పనులు తప్పక మంజూరవుతాయని, అలాగే గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులకు సమాచారం అందిస్తామని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కార్యక్రమంపై దృష్టి సారించి త్వరితగతిన ఆ పనులు పూర్తి చేయాలని సుభద్ర గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన పెండింగ్ కనెక్షన్లు, కొన్ని ప్రాంతాల్లోని ఇతర సమస్యలపై మాడుగుల మిగతా 2లో..

పాత ధరలే..

◆ అనకాపల్లి జిల్లాలో 136 మద్యం దుకాణాలకుగాను 52 ప్రారంభం

◆ విశాఖలో రోజంతా కొనసాగిన అస్పష్టత, కొన్నిచోట్లే అమ్మకాలు

◆ గిరాకీ స్థలాల కోసం వ్యాపారుల అన్వేషణ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, ఎంవిపి.కాలనీ

నూతన మద్యం పాలసీ ప్రకారం దుకాణాల ఏర్పాటును పూర్తిచేసిన ప్రభుత్వం కొత్త ధరలను మాత్రం అమల్లోకి తేలేదు. లైసెన్సు పొందిన దుకాణాల్లో పాత ధరలకే బుధవారం మద్యం విక్రయించారు. అనకాపల్లి జిల్లాలో 136 దుకాణాలకు లైసెన్సు పొందిన ప్రయివేటు వ్యాపారులు బుధవారం 52 దుకాణాల్లో అమ్మకాలు ప్రారంభించారు. ఈ అమ్మకాలు కూడా పాత ధర ప్రకారమే సాగడంతో మద్యం ప్రియులు తీవ్ర నిరాశపడ్డారు. ప్రభుత్వం ప్రకటించిన క్వార్టర్ రేటు రూ.99కు మద్యం ఇవ్వలేదు. కొత్త నిల్వలు రాకపోవడంతో పాత ధరలకు వ్యాపారులు అమ్మారు. కొత్త నిల్వల కోసం ఆర్డర్లు పంపారు. పాత దుకాణాల స్థలాల్లో కొత్త దుకాణాలు ఏర్పాటు చేయాలని అనుకున్నప్పటికీ, వాటిని ఖాళీ చేయక పోవడంతో దుకాణాలు పూర్తిగా ప్రారంభంకాలేదు. వ్యాపారం గిరాకీగా జరిగే ప్రదేశాల కోసం వ్యాపారులు అన్వేషిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో దుకాణాల ఏర్పాటు పూర్తి కానుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. కొత్త నిల్వలు వచ్చే వరకు పాత ధరలు అమలుకానున్నాయి. సిండికేట్లు మాత్రం ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే పది నుంచి 20 రూపాయలు పెంచి అమ్మాలన్న ఆలోచనలో వున్నారు. దుకాణాలకే అమ్మకాలు పరిమితం కాకుండా పరిసర గ్రామాల్లో కూడా అమ్మకాలు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన రహదారుల్లోని మిగతా 2లో..

విశాఖలో ఓ దుకాణం వద్ద గుమిగూడిన మందుబాబులు

కొనసాగుతున్న మలబార్ విన్యాసాలు

▶ వార్త 2లో..

పబ్లిక్ సెక్టార్ అథ్లెటిక్స్‌లో మీనా కుమారి సత్తా

▶ వార్త 8లో..

జీతాల కోసం సినర్జీస్ కార్మికుల ధర్నా

▶ వార్త 4లో..

మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి దీపిక

రూ.కోటి విలువైన పల్లాడియం స్వాధీనం

నలుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - అనకాపల్లి : సుమారు కోటి రూపాయల విలువైన పల్లాడియంను స్వాధీనం చేసుకొని నలుగురు నిందితులను పరవాడ పోలీసులు అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి దీపిక బుధవారం ఎస్‌పి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 9న రవీంద్ర హీరేయస్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న చింతకాయల రాజు, ముద్దనూరు వినీత్ వర్మ, చింతకాయల మురళి, కనుమూరి రామచంద్రరాజు కంపెనీలో కార్బన్ ఉత్ప్రేరకాలను సపోర్టు చేసే రూ.కోటీ 15 లక్షల విలువైన నాలుగు కిలోల 2 గ్రాముల పల్లాడియంను ప్రొడక్షన్ బ్లాక్‌లో డ్రైయర్‌లో ఆరబెట్టడాన్ని గమనించి మారు తాళాలతో దొంగిలించారు. దీంతో మిగతా 2లో..

విశాఖ డెయిరీ అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలి

◆ సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ◆ జిల్లా కలెక్టర్‌కు లేఖ

ప్రజాశక్తి - అనకాపల్లి

విశాఖ డెయిరీ అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి పాలరైతుల ఆస్తులను కాపాడాలని, పాడి రైతులకు ఎటువంటి నష్టమూ జరగకుండా చూడాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు బుధవారం లేఖ రాశారు. ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వ్యవసాయం తరువాత ప్రధాన జీవనాధారమైనది పాడి అని గుర్తుచేశారు. ఆయా జిల్లాల పరిధిలోని దాదాపు 3500 గ్రామాలకు చెందిన 3 లక్షల మంది పాడి రైతులు పాల ఉత్పత్తి సంఘాల ద్వారా విశాఖ డెయిరీకి పాలను ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. అటువంటి పాడి రైతుల ఆస్తులను పరిరక్షించి, ప్రోత్సహించాల్సిన విశాఖ డెయిరీ పాలకవర్గం తమ సొంత ఆస్తులను కూడబెట్టుకోవడానికి అనేక తప్పుడు మార్గాలను ఎంచుకొని వివిధ రూపాల్లో అవినీతికి పాల్పడుతోందని పేర్కొన్నారు. పాల ఉత్పత్తిదారులకు చెందిన ఆస్తులను కొద్ది మంది వ్యక్తులు తమ సొంతం చేసుకుంటున్నారన్నారు. 2016లో రూ.1100 కోట్లు ఉన్న టర్నోవర్ 2020లో సుమారు రూ.2000 కోట్లు దాటిందని తెలిపారు. ఆ తరువాత 2 వేల కోట్ల టర్నోవర్ నుంచి నష్టాల బాటలో, అప్పుల వేటలకు తీసుకొచ్చారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ తరహా అవినీతి, అక్రమాల ప్రయత్నాలను వెంటనే నిలిపివేయడానికి ప్రభుత్వం జోక్యం చేసుకొని సిబిఐతో విచారణ జరిపించేలా తగిన చొరవ తీసుకోవాలన్నారు.

ఆరోపణలు ఇలా..

విశాఖ డెయిరీ అవినీతి, అక్రమాలపై వినిపిస్తున్న ఆరోపణలను లోకనాథం ప్రస్తావించారు. ఆ మేరకు..'విశాఖ డెయిరీకి విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గర్భాం గ్రామంలో ఖాతా నెంబర్ 3000111 - 2204 శ్రీ విజయ విశాఖ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ పేరుతో 50 ఎకరాలు భూమి కొన్నారు. ఈ భూమిని ఎకరం 38 లక్షల చొప్పున కొన్నారు. ఈ ప్రాంతంలో ఎకరం భూమి రూ.10 లక్షలు కూడా లేదు. అయినప్పటికీ అంత ఎక్కువ ధరతో కోట్లాది రూపాయలను ఇక్కడ వెచ్చించారు. ఇది విజయనగరం జిల్లాలో వైసిపి నాయకులుగా ఉన్న చిన్న శ్రీను సారథ్యంలో జరిగింది. విజయనగరంలోని వైజాగ్ జిందాల్ దగ్గర 5 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలోని పెదపాడు వద్ద కూడా భూములను డెయిరీ కొన్నది.

డెయిరీ ఎంప్లాయీస్‌కు ఇళ్లు నిర్మిస్తామన్న పేరుతో పెందుర్తి మండలం నరవ గ్రామంలో సర్వే నెంబరు 368, 360లో 3.20 ఎకరాలు భూమిని విశాఖ డెయిరీ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఎంప్లాయీస్ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో కొన్నారు. ఆ భూమిలో ఆడారి కుటుంబానికి చెందిన ఇద్దరు కొడుకులు, ఒక కూతురుకు 90 సెంట్లు భూమిని ఆ హౌస్ బిల్డింగ్ సొసైటీ వారి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

చిత్తశుద్ధితో పనిచేయండి

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి లేవనెత్తిన ప్రశ్నకు బదులిస్తూ, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆర్‌టిసి సంస్థ వివిధ రూట్లలో నిలుపుదల చేసిన బస్సులను పున్ణ ప్రారంభించాలని ఎమ్మెల్యే బండారు సభ దృష్టికి తీసుకువచ్చారు. వచ్చే జెడ్‌పి సర్వ సభ్య సమావేశానికి పూర్తిచేసిన పనుల నివేదికతో హాజరుకావాలని ఛైర్‌పర్సన్ అధికారులను కోరారు. జెడ్‌పి సిఇఒ పి.నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన దాదాపు 95 శాతం వరకు పింఛన్లు పంపిణీ జరుగుతోందని అన్నారు. అందుబాటులో లేని మిగిలిన వారికి మరుసటి రోజున పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అప్పటికీ గ్రామాలలో పింఛన్ల విషయంలో ఏమైనా ఇబ్బంది వస్తే స్థానిక ఎంపిడిఒకు తెలియజేయాలని, వెంటనే తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

పాత ధరలే..

ఇతర షాపులకు మద్యం సరఫరాచేసి విక్రయాలు పెంచుకోవాలని సిండికేట్లు భావిస్తున్నారు.

విశాఖలో ఇలా..

విశాఖ జిల్లాలో నూతన మద్యం దుకాణాలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే తొలి రోజు ప్రారంభమయ్యాయి. డ్రాలో మద్యం షాపులు పొందినవారు సాంకేతిక కారణాల వల్ల స్టాకును కొనుగోలు చేయలేకపోయినట్టు భోగట్టా. రూ.99కే మద్యాన్ని విక్రయించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది కదా ? మరి ఎక్కువ ధరకు అమ్ముతున్నారేంటి ? అని పలువురు మందుబాబులు షాపుల నిర్వాహకులను అడగడం కనిపించింది. కొత్త స్టాక్ అందుబాటులో లేకపోవడంతో గతంలో మిగిలిన స్టాకును పాత రేట్లుకు అమ్ముతున్నట్టు వ్యాపారులు తెలిపారు. స్టాకు, ధరల విషయంలో విశాఖలో రోజంతా అస్పష్టత కొనసాగింది. రెండు, మూడు రోజుల్లో కొత్త స్టాక్ వస్తుందని అధికారులు చెబుతున్నారు.

రూ.కోటి విలువైన పల్లాడియం స్వాధీనం

కంపెనీలో పనిచేసే టెక్నికల్ డైరెక్టర్ ఎస్.వరదరాజన్ పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌పి దీపిక ఆదేశాలతో అదనపు ఎస్‌పి క్రైమ్స్ ఎల్.మోహన్‌రావు, పరవాడ డిఎస్‌పి కెవి.సత్యనారాయణల పర్యవేక్షణలో రంగంలోకి దిగిన పరవాడ పోలీస్ సిబ్బంది ఈ నెల 15న పరవాడ మండలం తానాం శ్మశాన వాటిక వద్ద పల్లాడియంను విక్రయించేందుకు రిసీవర్ల కోసం చూస్తున్న నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి కోటీ 15 లక్షల రూపాయల విలువైన నాలుగు కిలోల 110 గ్రాముల పల్లాడియంను, పల్సర్ బైక్‌ను, మారు తాళం చెవిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై నిందితులను విచారించగా ఈ నెల 5న దొంగతనానికి ప్రణాళిక వేసినట్టు అంగీకరించారు. నాలుగు రోజుల్లో కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్‌పి అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ధర్నా

నినాదాలు చేస్తున్న జగన్ తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోర్టు ఆసుపత్రిని ప్రైవేట్ వారికి అప్పగించడం కోసం ప్రీ బిడ్డింగ్ సమావేశం నిర్వహించడం దుర్మార్గమంటూ విశాఖపట్నం పోర్టు ఎబిబి వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.జగన్, హెచ్ఎంఎస్ నాయకులు మంగయ్య నాయుడు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలని, సొంత నిధులతో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గతంలో పోర్టులో వచ్చిన లాభాలతో పోర్టు ఏర్పడిన తర్వాత 50 ఏళ్లు అయిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ఏర్పడిందన్నారు. హాస్పటల్ ఏర్పాటులో కార్మికుల రక్తపుబొట్లు ఉన్నాయన్నారు. 40 వేల మంది ఆరోగ్యాలను ప్రైవేట్ వాళ్లకి ఇవ్వాలన్న కేంద్ర బిజెపి విధానం అత్యంత దుర్మార్గమైనదన్నారు. పోర్టు ఏర్పడిన నుంచి ఈ రోజు వరకు లాభాల్లోనే నడుస్తోందని, వేల ఎకరాల భూమి ఉందని, రిజర్వ్ ఫండ్స్ ఉన్నాయని తెలిపారు. అయినా ప్రైవేటు వారికి హాస్పిటల్‌ను ఇవ్వడం సరికాదన్నారు. యాజమాన్యం తన ఆలోచనను విరమించుకోకుంటే జిల్లాలో ఉండే కార్మిక, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అవసరమైతే పోర్టు ఛైర్మన్ ఆఫీస్‌ను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.లక్మణరావు, సాంబమూర్తి, రామలింగేశ్వరరావు, లక్ష్మణ్, శంకర్రావు, ఎఐటియుసి నాయకులు శంకరన్, రమణ బాబు, హెచ్ఎంఎస్ నాయకులు అంజి, ఐఎన్‌టియుసి నాయకులు చందు, సిఎఫ్‌టియు నాయకులు మూర్తి, బిఎంఎస్ నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు. యాజమాన్యం నిర్వహించిన సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొని హాస్పిటల్‌ను ప్రైవేటుపరం చేయొద్దని కోరారు.

విశాఖ డెయిరీ అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి..) దగ్గర నుంచి ఉచితంగా వారి పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఒక్కొక్కరికీ 30 సెంట్లు చొప్పున 90 సెంట్లను ఆనంద్ కుమార్, ఆడారి సంతోష్ కుమార్, పిల్లా రమాకుమారిలు అప్పనంగా కొట్టేశారు. మిగిలిన 2 ఎకరాల 30 సెంట్లను డెవలప్‌మెంట్‌కు కట్టబెట్టి నాసిరకమైన కట్టడాలతో 80 మందికి ఇళ్లు కట్టించారు. మిగిలిన భూమిలో నిర్మాణాలు చేసి ఇదే కుటుంబ సభ్యులు అద్దెలకు ఇచ్చి అనుభవిస్తున్నారు. ఈ విషయమై ఐదుగురు ఎంప్లాయిస్ ఇప్పటికే కోర్టుకెక్కి పోరాడుతున్నారు. సెకండ్ ఫేజ్‌లో మరో 120 మంది ఎంప్లాయిస్‌కు ఇళ్లు కట్టిస్తామని ఒక్కొక్కరి దగ్గర నుంచి 1,50,000 నుంచి 1,80,000 వరకు వసూలు చేశారు. ఇప్పటికీ లే అవుట్లు వేయకుండా, ఇల్లు కట్టించకుండా వారికి మొండి చేయి చూపారు.

పాల సొసైటీ సెక్రటరీల ట్రస్టుకు వచ్చే కమిషన్ సుమారు 10 కోట్ల రూపాయలలో రెండు కోట్ల రూపాయల ఇన్‌కం ట్యాక్స్ కట్టకపోవడంతో డిపార్టుమెంట్ నుంచి నోటీసులు వచ్చాయి. ఈ ఫండ్‌ను గర్భాంలోని భూమి కోసం వినియోగిస్తున్నట్లు తీసుకొని ఆడారి ఆనంద్ కుమార్ ఎన్నికల్లో 6 కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. ఇటీవల జరిగిన బోర్డు మీటింగ్‌లో పాల సొసైటీల సెక్రటరీలు ఈ డబ్బు కోసం డిమాండ్ చేసి అడిగినా ఎటువంటి సమాధానమూ లేదు. అలాగే విజయనగరానికి చెందిన కోలా కోటమయ్య అనే డైరెక్టర్ అల్లుడు డెయిరీ ఎంప్లాయ్‌గా ఉంటూనే డెయిరీ పేరుతో వై జంక్షన్‌లో కొన్న 20 ఎకరాల భూముల్లో 20 సెంట్లు భూమిని అప్పనంగా కొట్టేసి ఒక విలాసవంతమైన ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నాడు.

అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో ప్రవేశపెట్టిన ట్రైనింగ్ ప్రోగ్రామ్ దీన్ దయాల్ గ్రామీణ కౌసల్య యోజనకు సంబంధించి పాడి రైతుల పిల్లలకు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో తలపెట్టిన 3 నుంచి 12 నెలల ప్రోగ్రాంలో కూడా అవినీతి జరిగింది. డెయిరీ స్కూల్‌లో మిలీనియం సాఫ్ట్ వేర్‌తో టై అప్ అయ్యి వారికి కోట్లాది రూపాయలను అప్పనంగా బదిలీ చేశారు.

డెయిరీ గంగా మిల్క్ పాల ప్యాకెట్ల తయారీకి 4 శాతం సేల్స్ ట్యాక్స్ కట్టాల్సి ఉండగా ఇది ఎగ్గొట్టి 70 నుంచి 80 కోట్లు బకాయి పడితే .. ఈ విషయమై ట్రిబ్యునల్‌లో కేసు వేయగా అక్కడి నుంచి హైకోర్టులో కేసు కోసం డెయిరీ నిధులను 35 కోట్ల రూపాయల మేర కోర్టులో డిపాజిట్ చేశారు. ఈ రకంగా వాస్తవంగా కట్టాల్సిన ట్యాక్స్ కట్టకుండా ఉన్నారు. ఇప్పుడు ఈ కోర్టు కేసు ఓడిపోతే రైతులు సొమ్ము డెయిరీ నిధులను 100 కోట్ల వరకు ట్యాక్స్ కట్టాల్సి ఉంటుంది.

విశాఖ డెయిరీ ఎమ్‌డిగా ఉన్న సరగడం వెంకటరమణ నేడు 10 లక్షలు జీతంతో మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన విశాఖపట్నంలోని వాల్తేరు క్లబ్ మెంబర్ షిప్ కోసం రూ.25 లక్షల డెయిరీ సొమ్మును కట్టారు.

విశాఖపట్నంలోనే ఖరీదైన ప్రాంతంగా ఉన్న చినగదిలిలో 7.95 ఎకరాలులో 500 కోట్ల రూపాయలు విలువచేసే భూమిని తీసుకుని ప్రభుత్వానికి ఎటువంటి పైసా కట్టకుండా నిర్మాణాలు చేయడంతో పాటు అక్కడ నుంచి వ్యాపార పనులు చేయిస్తున్నారు. ఈ కట్టడాలకు జివిఎంసి నుంచి అనుమతులుగానీ, పన్నులుగానీ, ఖాళీ స్థల ట్యాక్స్‌గానీ కట్టకుండా మేనేజ్ చేసుకుంటూ వస్తున్నారు. ఈ రకంగా ఈ 500 కోట్ల భూములను ఆధారం చేసుకుని మొన్నటి ఎన్నికల్లో జగన్ పార్టీకి 200 కోట్ల రూపాయలు బదలాయించినట్లుగా తెలుస్తోంది' అన్న ఆరోపణలు జనం నుంచి వినిపిస్తున్నాయని లోకనాథం తెలిపారు. 'ఆడారి కుటుంబం, మేనేజింగ్ డైరెక్టర్, కాంట్రాక్టర్లు బిఆర్.నాయుడు, సీనియర్ మేనేజర్లు కలిపి రైతులను, ఉద్యోగులను, కార్మికులను పిప్పిచేసి పిండుకొని, వారి కష్టార్జితాన్ని ఇష్టానుసారంగా వాడుకుంటున్నారు. దీనిపై ఇప్పటికే ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు, సిబిఐ ఎస్‌పికి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుకు, రాష్ట్ర ప్రభుత్వానికి, రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్‌కి, కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ తదితరులకు ఫిర్యాదులు వెళ్లాయి' అని లోకనాథం పేర్కొన్నారు.

పాడి రైతులకు ఇవ్వాల్సిన రాయితీలను, సౌకర్యాలను డెయిరీ నేడు పూర్తిగా తెగ్గోసిందని తెలిపారు. కావున వెంటనే జోక్యం చేసుకొని విశాఖ డెయిరీ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని కలెక్టర్‌ను ఆయన కోరారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDL DISTRICT JUDGE, AT VISAKHAPATNAM
IA No.341/2021 in O.S.No. 378/2013
Between:
Smt Kunisetti Annapurna and another
..Petitioners/Plaintiffs
And:
Sri Kunisetti Sudhakar & others
..Respondents/defendants
NOTICE
To
1.Sri Kunisetti Sudhakar, S/o late Satyanarayana, aged 45 years, 50-98-4, Vivekananda nagar, Seethammadhara, Visakhapatnam
2. Sri Krishna rao, father's name not known to petitioners, Resident of 50-98-4, Vivekananda nagar, Seethammadhara, Visakhapatnam
3. Smt. Vineetha W/o Israil, R/o. 50-98-4, Vivekananda nagar, Seethammadhara, Visakhapatnam
Please take notice that the petitioners/plaintiffs filed the above petition under Order IX Rule 9 CPC praying the Hon'ble court to set aside the dismissal order dated 01.10.2018 passed in OS No.378/2013. The petition stands posted to **06.11.2024** for your appearance. Therefore, you are hereby called upon to appear before the Hon'ble court on the above said date at **10:30 AM,** either in person or through a pleader. In default of your appearance, the Hon'ble court will decide the matter ex-partely.
(BY ORDER OF THE HON'BLE COURT)
By Sri. G.M.Reddy,
Sri.B.Vivekananda Reddy
Advocates, Visakhapatnam-13
Mobile No. 9849113617

కొనసాగుతున్న మలబార్ విన్యాసాలు

ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం తీరంలో మలబార్ - 2024 సీ ఫేజ్ విన్యాసాలు బుధవారమూ కొనసాగాయి. ఆస్ట్రేలియా, భారత్, జపాన్, అమెరికా దేశాలకు చెందిన నావికాదళ యుద్ధనౌకలు, హెలికాప్టర్లు, సముద్ర గస్తీ విమానాలు బంగాళాఖాతంలో జరిగిన విన్యాసాల్లో పాల్గొన్నాయి. తాజా యుద్ధ విన్యాసాల్లో మున్ముందు భారత నౌకాదళ జలాంతర్గాములు కూడా పాల్గొంటాయని, వివిధ దేశాల ప్రత్యేక దళాల సంయుక్త విన్యాసాలు కూడా ఈ ఫేజ్‌లో ఉంటాయని వెల్లడించారు. భాగస్వామ్య దేశాల పరస్పర సంబంధాలను బలోపేతం చేయటంతో పాటు ఇండో-పసిఫిక్‌లో భద్రతా స్థిరత్వాన్ని పెంపొందించడానికి ఇవి తోడ్పడతాయని తెలిపారు.

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
IA 253/2024 IN OS 35/2019
Between:- **పొట్నూరు సోమేశ్వర రావు వగైరాలు**
---Petitioners/defendants no.2 & 3
And:- **పొట్నూరు బాల కామేశ్వర రావు వగైరాలు...**
---Respondents/Plaintiffs/Defendant no.4
To,
1. పొట్నూరు బాల కామేశ్వరరావు, S/o లేట్ వెంకట రమణయ్య, వయస్సు 65 సం'లు, రిటైర్డ్ ఉద్యోగి, D. no:- 49-39-10/1B నివాసం, జయంతి ఎనక్లేవ్, NGGO'S కాలనీ, అక్కయ్యపాలెం, విశాఖపట్నం పట్టణం.
2. పొట్నూరు మురళీకృష్ణ, S/o లేట్ వెంకట రమణయ్య, వయస్సు 61 సం'లు, రిటైర్డ్ ఉద్యోగి, D.No:-58-1-236/97 నివాసం,త్రీకరం ఎనక్లేవ్, UDO కాలనీ, NAD కొత్త రోడ్, విశాఖపట్నం పట్టణం.
3. పొట్నూరు సాయిరాజు, S/o వెంకట రమణయ్య,వయస్సు 63 సం'లు, వ్యాపారం,D. No:- 10-26/17, 1st ఫ్లోర్, సాయిరామ్ కాలనీ, టీచర్స్ లే ఔట్, దుర్గాలమ్మ గుడి దగ్గర, కొమ్మాది, విశాఖపట్నం-48
నోటీస్
పై నెంబర్ దావాలో petitioners/defendents nos.2 &3 మీ పై దాఖలు చేసిన పిటిషన్ మీ హాజరు నిమిత్తం **తేదీ 29-10- 2024 న వాయిదా అయి ఉన్నది.** గాన సదరు పై తేదీన ఉదయం 10.30 గం లకు మీరు స్వయంగా గాని వకీల్ ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదన తెలియపరచవలెను, లేనియెడల మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించడం జరుగును.
// By orders of the court//
B. శ్రీనివాస సత్యనారాయణ,
B. సుదర్శన రావు
పిటిషనర్స్ తరుపున న్యాయవాదులు
శ్రీకాకుళం, సెల్: 9440549983.

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
IA 254/2024 IN OS 35/2019
Between:- **పొట్నూరు సోమేశ్వర రావు వగైరాలు..**
....Petitioners/Defendants no.2 & 3
And:- **పొట్నూరు బాల కామేశ్వర రావు వగైరాలు...**
....Respondents/Plaintiffs/Defendant no.4
To,
1. పొట్నూరు బాల కామేశ్వరరావు, S/o లేట్ వెంకట రమణయ్య, వయస్సు 65 సం'లు, రిటైర్డ్ ఉద్యోగి, D. no:- 49-39-10/1B నివాసం, జయంతి ఎనక్లేవ్, NGGO'S కాలనీ, అక్కయ్యపాలెం, విశాఖపట్నం పట్టణం.
2. పొట్నూరు మురళీకృష్ణ, S/o లేట్ వెంకట రమణయ్య, వయస్సు 61 సం'లు, రిటైర్డ్ ఉద్యోగి, D.No:-58-1-236/97 నివాసం,త్రీకరం ఎనక్లేవ్, UDO కాలనీ, NAD కొత్త రోడ్, విశాఖపట్నం పట్టణం.
3. పొట్నూరు సాయిరాజు, S/o వెంకట రమణయ్య,వయస్సు 63 సం'లు, వ్యాపారం,D. No:- 10-26/17, 1st ఫ్లోర్, సాయిరామ్ కాలనీ, టీచర్స్ లే ఔట్, దుర్గాలమ్మ గుడి దగ్గర, కొమ్మాది, విశాఖపట్నం-48
నోటీస్
పై నెంబర్ దావాలో Petitioners/Defendents nos.2 & 3 మీ పై దాఖలు చేసిన పిటిషన్ మీ హాజరు నిమిత్తం **తేదీ 29-10-2024 న వాయిదా అయి ఉన్నది.** గాన సదరు పై తేదీన ఉదయం 10.30 గం లకు మీరు స్వయంగా గాని వకీల్ ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదన తెలియపరచవలెను, లేనియెడల మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించడం జరుగును.
// By orders of the court//
B. శ్రీనివాస సత్యనారాయణ,
B. సుదర్శన రావు
పిటిషనర్స్ తరుపున న్యాయవాదులు
శ్రీకాకుళం, సెల్: 9440549983.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
O.S. 264/2022
Between:
1) Devarapalli Sone Sunand,
2) Devarapalli Vijay Joseph,
3) Devarapalli Joseph Devadas
(The plaintiffs 1 to 3 are being Rep. by their GPA Holder Pentapali Uday Kumar ...Plaintiffs
And
Karri Kanaka Raju & Another
...Defendants
SUMMONS
To,
D-2: Baday Vidya Sagar,
S/o. B. John Robert, Christian, aged about 53 years, R/at Flat No. A-1, Amba Apartments, CBM Compound, Opposite Timpany School-B Gate, Visakhapatnam-03.
Please take notice that the above named plaintiffs has instituted the above suit against you and the above matter stands posted to **28-10-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **28-10-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
W.V.B. RAMALINGAM (Buchi)
Advocate, Visakhapatnam

IN THE HON'BLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
O.S.521/2024
Between:
STATE BANK OF INDIA,
Dondaparthi Branch,
Visakhapatnam, Rep. by its Branch Manager ...Plaintiff
And
Khageswara Majhi ...Defendant
SUMMONS
To, **The Defendant:**
Khageswara Majhi,
R/at D.No.504/4, BNTN Colony Railway Quarters, Kancharapalem, Near Ashirwad Kalyanamandapam, Visakhapatnam-530004.
Please take notice that the above named Plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **28-10-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **28-10-2024 at 10:30 A.M** in the above Courtto answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Honble Court)
K. SATYA DEVI, Advocate
Ram Nagar, Visakhapatnam.

గీతంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యాన బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 200 మందికి పైగా విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎన్‌టిఆర్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ నిపుణులు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థి విభాగం డీన్ కె.బాలాకుమార్, రోటేరియన్ డాక్టర్ స్వాతి చిక్కాల ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితులలో ఉన్నవారికి రక్తం అందించడం ద్వారా ప్రాణాలు నిలుస్తాయని చెప్పారు. ప్రస్తుత అవసరాలను గుర్తించి యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. నగరంలోని వివిధ బ్లడ్ బ్యాంక్‌ల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు గీతంలో వరుసగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ కె.జశ్వంత్, రోటరాక్ట్ క్లబ్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు.

రక్తదానం చేస్తున్న గీతం విద్యార్థులు

జీవాలకు నట్టల నివారణ మందులు

జెవి.అగ్రహారంలో గొర్రెలకు నట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్ర శేఖర్

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం ఆర్.తాళ్లవలస ప్రభుత్వ పశు వైద్య శాల వైద్యులు ఎస్.జి.ప్రశాంతి ఆధ్వర్యాన బుధవారం 950 గొర్రెలకు నట్టల నివారణ మందులు అందజేశారు. ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న సామూహిక నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా జివిఎంసి నాలుగో వార్డు జెవి.అగ్రహారంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని విశాఖ పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గొర్రెలు, మేకల్లో నట్టల నివారణకు మందులు అందజేస్తున్నామని, వినియోగించుకోవాలని గొర్రెలు, మేకల పెంపకందారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పశు వైద్యశాల భీమిలి ఏరియా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి పవిత్రోత్సవాల నిర్వహణపై సమావేశం

ప్రజాశక్తి -పద్మనాభం : ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే పవిత్రోత్సవాలకు సంబంధించి అనంతపద్మనాభ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయంలో బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సమావేశమయ్యారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పవిత్రోత్సవాల నిర్వహణకు భక్తుల నుంచి నిధులు సమీకరించడానికి సన్నాహాలు చేశారు. ఆలయం ఈవో నానాజీబాబు కొన్ని కార్యక్రమాలు ఆలయం ద్వారానే చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిపి రాంబాబు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు కె.నగేష్‌కుమార్ జనసేన మండల అధ్యక్షులు కె.రామస్వామినాయుడు, ఆర్.సన్యాసిరావు, కె.ఎర్రినాయుడు, టి.పైడిరాజు, ఎ.దేవుడు తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాల నిర్వహణపై సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - అరిలోవ : రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యాన బుధవారం ఆరిలోవ అంబేద్కర్ జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. పెరిగే ధరలకు హద్దే లేదా?, ఏలే వాడికి బుద్ధిలేదా? అంటూ నినదించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సిపిఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి షేక్.రహిమాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు క్షేత్రపాల్ మాట్లాడుతూ, ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారాలు వేస్తోందన్నారు. ధరలు అదుపులో ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎ.దేవుడమ్మ, లక్ష్మణరావు, కాసుబాబు, పుష్పలత, చిరంజీవి, రవి, నూకరాజు, సత్తిబాబు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

9 మద్యం దుకాణాలు ప్రారంభం

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో 13 ప్రయివేట్ మద్యం దుకాణాలకు గానూ బుధ వారం 9 ప్రారంభమయ్యాయి. ఇందులో జివిఎంసి రెండో వార్డు నమ్మివానిపేటలో 1, మూడో వార్డు పెద్ద బజారులో 2, చిన్న బజారులో 3, నాలుగో వార్డు పరిధి మంగమారిపేటలో 2, తిమ్మాపురంలో 1మద్యం దుకాణాలు ప్రారంభమైనట్లు భీమిలి ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు తెలిపారు.

బాధితులకు వితరణ

ప్రజాశక్తి -మధురవాడ : కిడ్నీలు పాడైపోయి బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ కళింగ సంక్షేమ సేవా సంఘం అండగా నిలిచింది. పేడాడ నాగరత్నం (58) భర్త చనిపోవడంతో తల్లితో కలిసి నివసిస్తోంది. ఇటీవల ఆమెకు రెండు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతోంది. డయాలసిస్ చేయించుకునే ఆర్థిక స్తోమత లేదు. తినేందుకు కూడా ఇబ్బంది పడుతున్న వారికి ఆంధ్రప్రదేశ్ కళింగ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీపాన వెంకటరమణ ఆధ్వర్యాన బుధవారం నిత్యావసర వస్తువులతో పాటు రూ.35 వేల చెక్కును ఆమెకు అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిఎస్‌పి ఎస్‌వివి.ప్రసాద్, కార్యదర్శి బెండి నారాయణరావు, కార్యదర్శి పాతిన శ్రీనివాసరావు, సెక్రటరీ మొజ్జాడ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి యోగా పోటీలకు శ్రీ వెంకట్ విద్యాపీఠ్ విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం : జిల్లాస్థాయి యోగా పోటీలకు శ్రీ వెంకట విద్యాపీఠ్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రొంగళి వెంకటేశ్వరరావు తెలిపారు. సింహాచలంలో నిర్వహించిన భీమిలి నియోజకవర్గం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) యోగా పోటీల్లో ఆనందపురం మండలం శొంఠ్యాంలోని శ్రీ వెంకట్ విద్యాపీఠ్ పాఠశాల నుంచి మొత్తం 13 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరు 18వ తేదీన వేంపాడులో జరగనున్న జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను రొంగళి వెంకటేశ్వరరావు, ఆర్.పద్మ, ప్రిన్సిపాల్ ఆర్.సత్యవేణి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆశీర్వదించారు.

డైట్‌లో ప్రపంచ ఆహార దినోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ, 2024 ప్రపంచ ఆకలి సూచీలో మన దేశం 105వ స్థానంలో ఉందన్నారు. అంటే మన దేశంలో ఆహార కొరత, పోషకాహార లోపం భయంకరమైన సమస్యలుగా ఉన్నాయని వివరించారు. మెరుగైన జీవితం, భవిష్యత్తు కోసం ఆహార హక్కు అనే అంశంపై ఈ ఏడాది ఆహార దినోత్సవం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎం.మాణిక్యంనాయుడు, అధ్యాపకులు జిజిఎస్.నాగేశ్వరరావు, జి.రవి, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ కెమిస్ట్రీలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో స్పాట్ అడ్మిషన్ల నిమిత్తం పిజి సెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు తమ కళాశాలలో దరఖాస్తులు చేసుకోవచ్చుని ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సి హెచ్.విష్ణుమూర్తి బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న శాస్త్రి తదితరులు

చంద్రంపాలెం పాఠశాలలో 'మిడ్డే' పరిశీలన

ప్రజాశక్తి -మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ జెవిఎన్.శాస్త్రి, చినగదిలి ఎంఇఒ అనురాధ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం అమలును పర్యవేక్షించారు. మధ్యాహ్న భోజన పథకం రికార్డులు తనిఖీ చేశారు. ఎక్కువ మంది విద్యార్థులు గుడ్డు తీసుకోకపోవడంపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు ప లు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

గుడి నిర్మాణానికి విరాళం చెక్కును అందజేస్తున్న సుభాష్‌చంద్రబోస్

గుడి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి -ఆనందపురం: అయ్యప్ప స్వామి గుడి నిర్మాణానికి మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఆనందపురం మండలం దిబ్బడిపాలెంలో అయ్యప్ప స్వామి సేవాపీఠం నిర్మాణం నిమిత్తం ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్‌ను గ్రామస్తులు కలిశారు. శంకుస్థాపన సమయంలో రూ.లక్ష, బుధవారం మరో రూ.లక్షను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి, పాపునాయుడు, అప్పలరాజు, కె.రమణ, కె.అప్పలరమణ, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పిఎం విశ్వకర్మ యోజనపై అవగాహన

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : జివిఎంసి జోన్- 2 కార్యాలయం పరిధిలో పిఎం విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విశాఖ ఎంపి శ్రీభరత్ హాజరై మాట్లాడారు. సంప్రదాయ వృత్తులు నిర్వహించే వారికి చేయూతనిచ్చి, ప్రోత్సాహం అందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుల, మత బేధాలు లేకుండా 19 వృత్తుల వారికి ఈ పథకం ద్వారా సహకారం అందుతుందని తెలిపారు. 5 నుంచి 7 రోజులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. రూ.15 వేలు విలువైన టూల్ కిట్, మొదటి విడత రూ.లక్ష, రెండవ విడత రూ.2 లక్షలు రుణం అందజేస్తారని తెలిపారు. ఈ పథకం దేశంలో కోటి మందికి అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నికుమారి, మొల్లి హేమలత, పిళ్లా మంగమ్మ, గంటా నూకరాజు, దాసరి శ్రీను, గరే గురునాథ్, జోనల్ కమిషనర్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం ఎంపిడిఓ కార్యాలయంలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన, శిక్షణ తరగతులను నిర్వహించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేతివృత్తుల వారికి పూర్వ వైభవం తీసుకురావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనా పథకం బ్రోచర్‌ను గంటా విడుదల చేశారు. కార్యక్రమంలో జిఎం ఇండస్ట్రీస్ ఆదిశేషు, డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి, ఎంఎస్ఎంఇ డిఫ్ఓ ఎడి చంద్రమౌళి, చాముండేశ్వరి, ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక, కోరాడ రాజబాబు, బిఆర్‌టి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : పిఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపి ఎం.శ్రీభరత్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జోన్ 4 కార్యాలయంలో పిఎం విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. సంప్రదాయ వృత్తులు నిర్వహించే వారికి చేయూతనిచ్చి, ప్రోత్సాహం అందిస్తున్న ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ న్యూరాలజీ సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

జాతీయ న్యూరాలజీ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నాలుగు రోజులు పాటు నగరంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి న్యూరాలజీ సదస్సు బుధవారం నోవాటెల్ హోటల్‌లో ప్రారంభమైంది. ఒకేసారి 4 సమావేశ మందిరాలలో ఒక్కొక్క అంశంపై సదస్సును ఏర్పాటుచేశారు. సదస్సులను ఐఎస్‌ఎ ప్రెసిడెంట్ డాక్టర్ దేబిశిష్ చౌదరి, సెక్రటరీ డాక్టర్ మీనాక్షి సుందరం, సదస్సుల నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.గోపి ప్రారంభించారు. స్ట్రోక్ ఉన్న రోగులలో మెడ, మెదడులో మూసుకుపోయిన నాళాల నుంచి గడ్డలు తొలగించడానికి పరికరాలు ఉపయోగించడంపై ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ప్రతి మల్టీ మోడలిటీ ట్రీట్మెంట్‌లో టీం వర్క్‌ను ఎలా ముందుకు తీసుకువెళ్లాలి అనే అంశంపై సైంటిఫిక్ రివ్యూ వర్క్ షాప్ నిర్వహించారు. నాడీ సంబంధిత డాక్టర్ పరిజ్ఞానం ఉపయోగించడం అంశంపై శిక్షణ అందించారు. మరో మూడు రోజులు పాటు నిర్వహించే ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి సుమారు 200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని సదస్సు నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.బుచ్చిరాజు మీడియాకు తెలిపారు.

విఎంఆర్‌డిఎ అభివృద్ధి పనులపై చర్చ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ నగర పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధిపై మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌తో విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ బుధవారం విఎంఆర్‌డిఎ కార్యాలయంలో చర్చించారు. విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధికి అవకాశం ఉన్న చోట బృహత్తర ప్రణాళికతో ముందుకెళ్లాలని ఎంపీ కోరారు. రహదారులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని, అంతర్గత రహదారులను ప్రధాన రహదారులకు అనుసంధానించాలని, ప్రస్తుతం జరుగుతున్న మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్, కార్యదర్శి కె.రమేష్, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, చీఫ్ అర్బన్ ప్లానర్, కార్యనిర్వాహక ఇంజినీర్ బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

అద్భుతంగా త్రివేణి స్వర సంగమం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : నగరానికి చెందిన ముగ్గురు గాయనీమణులు నిర్వహించిన 'త్రివేణి స్వర సంగమం' తెలుగు హిందీ, పాటలతో అలరించింది. సంస్థ వ్యవస్థాపకులు నారీ-భేరి సమర్పణలో గాయనీ మణులు సివి రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, శైలజ మేరాజ్ సంయుక్తంగా ఆలపించిన తెలుగు, హిందీ, గీతాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని విశాఖ పోర్టు విశ్రాంత అధికారి హరినాథ్ బాబు, డాక్టర్ ఉషా చీరాల, సన్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, విశాఖ సాంస్కృతిక రంగానికి ప్రతిష్ట తెస్తున్న ముగ్గురు గాయనీ మణులు అందిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గిరిధర్ వ్యాఖ్యానం, ఎన్‌విఆర్ నాగేశ్వరరావు స్వాగత వచనాలతో ప్రారంభమైంది. అలనాటి మేటి గీతాలతో ఆకట్టుకున్నారు. బంగారయ్య, పుండరీ కుమార్, సురేష్ కన్నా, అమ్మరాజురామ్, ఎన్‌విఆర్ నాగేశ్వరరావు, భూపతిరావు తదితరులు సహ గాయనీమణులతో ఆలపించారు.

త్రివేణి స్వర సంగమంలో గీతాలను ఆలపిస్తున్న గాయనీమణులు

గుడుల సమీపంలోనే వైన్ షాపులు

గణపతినగర్ జంక్షన్‌లో దుకాణాలపై స్థానికుల్లో ఆందోళన

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి గణపతినగర్ జంక్షన్‌లో రెండు వైన్ షాపులు ప్రారంభమయ్యాయి. గత వైసిపి ప్రభుత్వంలో ఇదే ప్రాంతంలో వైన్ షాప్ నిర్వహించారు. దీని వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారి పక్కన ఈ వైన్ షాప్ ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తీవ్రమయ్యాయి. ఇరుకు రోడ్డులో మద్యం షాపు వల్ల స్థానిక ప్రజలు విసిగి వేసారి పోయారు. గణపతినగర్ కూడలిలో ఆంజనేయస్వామి, శివాలయాలు ఉన్నాయి. ఆలయాల మధ్యలో వైన్ షాపులు వద్దని స్థానిక ప్రజలు మొత్తుకున్నా అప్పటి అధికారులు పట్టించుకోలేదు. వైన్ షాప్‌పై అనేక ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో చేసేదేమీ లేక ప్రజలు మిన్నకుండిపోయారు. వైసిపి ప్రభుత్వం పోయిన తర్వాత కూటమి ప్రభుత్వంలో లిక్కర్ పాలసీ మారిందని స్థానిక ప్రజలు చాలా సంతోషించారు. అయితే ఇటీవల లాటరీ ద్వారా లిక్కర్ షాపు సంపాదించుకున్న ఓ వ్యాపారి గణపతినగర్ జంక్షన్లో గతంలో నిర్వహించిన వైన్ షాపులోనే మళ్లీ వ్యాపారం ప్రారంభించాడు. దానికి మరికొద్ది దూరంలోనే ఇంకో వైన్ షాపును మరో వ్యాపారి ప్రారంభించాడు. దీంతో స్థానిక ప్రజలు విస్తుపోయారు. అసలు ఇక్కడ వైన్ షాపు లేకుండా పోతుందనుకుంటే రెండు షాపులు వచ్చాయని తలలు పట్టుకుంటున్నారు. కొత్తపాలెం, ఎల్లప్పవానిపాలెం, చంద్రనగర్, భగత్‌సింగ్‌నగర్, కారివేలనగర్, ఆదర్శనగర్, నరవ, కోట నరవ తదితర ప్రాంత ప్రజలు గణపతి నగర్ జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వైన్ షాపులు వద్ద మందుబాబులు తాగి చిందులు వేస్తూ వెకిలి చేష్టలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తారని, ఇది గతంలో ఎదురైన అనుభవమేనని స్థానికులు చెబుతున్నారు. గతంలో ప్రభుత్వం ఆధ్వర్యాన షాపులను నిర్వహించడంతో కొంతమేరకు పోలీసుల పర్యవేక్షణ ఉండేది. కానీ ప్రస్తుతం ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి లిక్కర్ వ్యాపారం రావడంతో వాళ్ల ఆదాయం కోసం అనేక అడ్డదారులు తొక్కుతారనేది జగమెరిగిన సత్యం. ఇక్కడ ఈ వైన్ షాపుల వల్ల విద్యార్థులు, మహిళలు, వ్యాపారులు, ఉద్యోగులు ఉదయం సాయంత్రం ఆ మార్గంలో వెళ్లటానికి భయపడే పరిస్థితులున్నాయి. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇక్కడ నుంచి వైన్ షాపులను దూరప్రాంతాలకు తరలించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పాత వైన్ షాప్ సమయంలో రోడ్డుపై మందుబాబుల రద్దీ (ఫైల్)

జీతాల కోసం సినర్జీస్ కార్మికుల ధర్నా

ఆందోళన తీవ్రతరం చేస్తాం : సిఐటియు

సినర్జీస్ గేటు వద్ద ధర్నాలో కార్మికులతో కలిసి నినదిస్తున్న ఎం.రాంబాబు

ప్రజాశక్తి -గాజువాక : సినర్జీస్ కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.రాంబాబు హెచ్చరించారు. సినర్జీస్ కార్మికులకు యాజమాన్యం ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కంపెనీ గేటు వద్ద బుధవారం సాయంత్రం కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఆరు నెలలుగా జీతాలు లేకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో పాటు, పస్తులతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికుల అడిగితే ఒక నెల జీతం చెల్లిస్తామని యాజమాన్యం చెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కనీసం మూడు నెలలకు సంబంధించిన జీతం తక్షణమే కార్మికులకు చెల్లించి, మిగతా జీతం కూడా కొద్దిరోజుల్లోనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. తక్షణమే ఈ సమస్య పరిష్కారానికి యాజమాన్యం చొరవచూపాలని కోరారు. అత్యధిక ఉష్ణోగ్రతలో కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం తీవ్ర అన్యాయం అన్నారు. భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సాయంత్రం ప్రారంభమైన ఆందోళన రాత్రి 10 గంటల వరకు సాగింది. గురువారం కూడా ఈ ధర్నా కొనసాగుతుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్తాత్రేయ నాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విభాగాలను పరిశీలించిన వీసీ

ప్రజాశక్తి -విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం ఉదయం సైన్స్ కళాశాల పరిధిలోని అడ్వాన్స్ సైన్సెస్ భవన్‌లోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఫుడ్ న్యూట్రిషన్ విభాగాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విభాగ ప్రయోగశాలలు, వసతులను గమనించారు. విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మితో సమావేశమయ్యారు. విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న విధానం అడిగి తెలుసుకున్నారు. విభాగాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'తెలుగు హీరోల తీరు మారాలి'

ప్రజాశక్తి-మాధవధార : తమిళ, మలయాళ హీరోలను చూసి తెలుగు సినిమా హీరోలు చాలా నేర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మూల వెంకటరావు అన్నారు. ఇప్పుడున్న సీనియర్ హీరోలు పర భాషా హీరోలను చూసైనా వారి గౌరవం, తెలుగు ప్రజల గౌరవం కాపాడే సినిమాలు చెయ్యాలని సూచించారు. కనీసం పరువు కాపాడే సినిమాలు తీయాలని పేర్కొన్నారు. తెలుగు సినిమా ఇండస్ట్రీ మంచి సందేశాత్మక చిత్రాలు చేయాలని కోరారు.

ఇది సమిష్టి గెలుపు

ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : ఇది తన గెలుపు కాదని, సమిష్టి గెలుపు అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. వడ్లపూడి సమీపంలోని గ్రీన్ సిటీ కల్యాణమండపంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన గెలుపునకు కృషి చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని చెప్పారు. గాజువాక నియోజకవర్గం వైపు రాష్ట్రమంతా చూసేలా మెజారిటీ అందించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. రాష్ట్రంలో అత్యధిక మెజారిటీ రావటంతో పార్టీ అధిష్టానం కీలక తనకు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ప్రధాన అజెండాగా నియోజకవర్గంలో తిరిగానని, దానికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడే ఆలోచనలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని పేర్కొన్నారు. గాజువాక నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేసిన తీరు అందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తనకు సమాచారం అందిస్తే వెంటనే పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గాజువాక నియోజకవర్గం జనసేన, బిజెపి శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోన తాతారావు, బిజెపి కన్వీనర్ కెఎన్‌ఆర్, కార్పొరేటర్లు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

కొనసాగిన సాగర్ సిమెంట్ లారీ డ్రైవర్ల సమ్మె

సాగర్ సిమెంట్ కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న డ్రైవర్లు

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలం బయ్యవరం సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ లారీ డ్రైవర్ల సమ్మె మూడో రోజు కూడా కొనసాగింది. సాగర సిమెంట్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్ల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సమ్మెలో భాగంగా బుధవారం కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ పార్థసారథి ట్రాన్స్ పోర్ట్ కంపెనీ ద్వారా సిమెంట్ రవాణా చేస్తున్న కార్మికులకు ఏడు సంవత్సరాలుగా జీతాలు పెంచలేదని తెలిపారు. జీతాలు పెంచాలని మూడు రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నా యాజమాన్యం నేటికీ స్పందించలేదని పేర్కొన్నారు. జీతాలు పెంచాలని, తగ్గించిన కమిషన్ కొనసాగింపు చేయాలని, కంపెనీ ఆవరణలో బాత్‌రూములు, రెస్ట్ రూములు, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. డ్రైవర్లపై వేధింపులు ఆపాలన్నారు. టైర్లు డామేజ్, ప్రమాదాలు జరిగితే కార్మికుల జీతాలు నుండే ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం కోత పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై వందమంది డ్రైవర్లు సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు దాకారపు శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు గోవిందు, మణిబాబు, అప్పలనాయుడు, సురేష్, హరేకృష్ణ, ఎస్‌.యాదవరాజు, సత్యనారాయణ, రామకృష్ణ, పెద్ద సంఖ్యలో డ్రైవర్లు పాల్గొన్నారు.

భవిత కేంద్రం విద్యార్థితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

భవిత కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - కశింకోట

కశింకోట భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం సందర్శించారు. వికలాంగ విద్యార్థులకు విద్య నేర్పే విధానాన్ని పరిశీలించారు. ఇక్కడ విద్యార్థులకు ఇస్తున్న భోజన గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎక్కడ నుండి ఎంతమంది వస్తున్నారో ఆరా తీశారు. ఈ విషయంపై బోధకులు రమణమ్మ మాట్లాడుతూ 20 మంది విద్యార్థులు వస్తున్నారని, నరసింగపల్లి, కశింకోట బాలుర హైస్కూల్ నుండి విద్యార్థులకు భోజనం తెచ్చి పెడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఐఇఆర్‌టి అధికారి శకుంతల, ఎంఇఒ సురేష్, వికలాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి రోజే మద్యం దోపిడీ

క్వార్టరుకు అదనంగా రూ.20 వసూలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మద్యం షాపులు ప్రారంభించిన తొలి రోజే వ్యాపారులు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. బుచ్చయ్యపేట మండల కేంద్రం నాలుగు రోడ్ల జంక్షన్లో బుధవారం మద్యం షాపును ప్రారంభించారు. సాయంత్రం 6 గంటల సమయంలో మద్యం స్టాక్‌ను షాపులో నింపి అమ్మకాలను ప్రారంభించారు. ప్రారంభించిన కొద్ది సమయానికి వ్యాపారులు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. ఒక్కో క్వార్టర్‌పై ఎంఆర్‌పి ధర కంటే రూ.20 అదనంగా వసూలు చేశారు. వందలాదిమంది మద్యం కొనుగోలుకు ఎగబడ్డారు. దీంతో రాయల్ స్టాగ్ ఎమ్మార్పీ ధర రూ.230 కాగా రూ.250కు అమ్మకాలు సాగించారు. మద్యం ధరలను పెంచి అమ్మకాలు చేయడంతో కొంతమంది టిడిపి నాయకులు షాపు షట్టర్లను దించి వేశారు. దీంతో అమ్మకాలు నిలిచిపోయాయి.

తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం ఊడేరు మెయిన్ రోడ్డు జంక్షన్లో కొన్ని నెలలుగా పేరుకుపోయిన తుప్పలను బుధవారం జెసిబి సహాయంతో తొలగించారు. విపరీతంగా పెరిగిన తుప్పలు వలన అక్కడ ఉన్న బస్ స్టాప్ కూడా ప్రయాణికులకు కనబడలేని పరిస్థితి ఉంది. దీంతో ఊడేరు కూటమి నాయకులు గుర్తించి జెసిబితో తుప్పలను తొలగించడం జరిగింది. కార్యక్రమంలో కూటమి నాయకులు ఇంటి తాతారావు, దండుపాటి పెద్ద గంగరాజు, దండుపాటి చిన్న గంగరాజు, మహంకాళి నారాయణరావు, సిరసపల్లి అచ్చిబాబు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి పాలకవర్గం శుభాకాంక్షలు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మూలపేట గ్రామపంచాయతీ కార్యదర్శిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన మొల్లేటి గంగాధర్‌కు సర్పంచ్ బీసెట్టి గంగప్పలనాయుడు, ఉపసర్పంచ్ మొల్లేటి దేవిచంద్ర శుభాకాంక్షలు తెలియజేశారు. గంగాధర్ రెగ్యులర్ కార్యదర్శిగా నియమితులు కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నామని సర్పంచ్ గంగప్పలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బీసెట్టి పైడికొండ, పాలకవర్గం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి -దేవరాపల్లి

ఉమ్మడి విశాఖ జిల్లా నుండి రాష్ట్ర స్థాయి అండర్-14, అండర్-17 సెపక్ తక్రా, ఫుట్ బాల్ పోటీలకు 46 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం జిల్లా స్థాయి పోటీలను సర్పంచి సబ్బవరపు పెంటమ్మ ప్రారంభించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 34 పాఠశాలల నుంచి 140 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఈ పోటీల్లో అండర్-14, అండర్-17 ఫుట్ బాల్ పోటీలకు బాలుర విభాగం నుంచి 18 మంది, బాలికల విభాగం నుంచి 18 మంది, సెపక్ తక్రాకు అండర్-14, అండర్-17 విభాగాలకు ఐదుగురు చొప్పున బాల, బాలికలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారుల్ని ఎంఈఓ పడాల్ దాసు, జిల్లా క్రీడా పరిశీలకుడు ఎంఎం మనోహర్, వ్యాయామ ఉపాధ్యాయులు బి.బాబురావు అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

స్టాపర్, సైన్ బోర్డులను ప్రారంభిస్తున్న ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-అనకాపల్లి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. అనకాపల్లి ట్రాఫిక్ పోలీసులకు స్థానిక ఎస్ఆర్ షాపింగ్ మాల్ అందించిన స్టాపర్ బోర్డులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైన్ బోర్డులను బుధవారం ఎస్‌పి దీపిక ప్రారంభించారు. ఈ మేరకు ఎస్ఆర్ షాపింగ్ మాల్‌కు ఎస్‌పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలో రహదారి భద్రతను మెరుగుపరచడానికి ప్రమాదలు నివారించడానికి ముఖ్య కూడళ్ళ వద్ద స్టాపర్ బోర్డులు, సైన్ బోర్డులను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. దీని వల్ల రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సబ్ డివిజన్ ఇంచార్జ్ డీఎస్పీ బి.అప్పారావు, అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, ఎస్‌బి ఇన్స్పెక్టర్ బాల సూర్యరావు, అనకాపల్లి టౌన్ ఎస్‌హెచ్‌ఓ టీవీ.విజయ్ కుమార్, అనకాపల్లి రూరల్ సీఐ అశోక్ కుమార్, సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ వినోద్ బాబు, అనకాపల్లి ట్రాఫిక్ ఎస్సై శేఖరం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలి

గొల్లలపాలెం-2 లేఅవుట్‌ను సందర్శించిన విశాఖ జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-సబ్బవరం

అర్బన్ ఇళ్ల నిర్మాణాల పనులు మరింత వేగవంతం చేయాలని, నిర్ణీత కాలంలోగా పనులను పూర్తి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ గృహ నిర్మాణ శాఖ అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా సబ్బవరం మండలం గొల్లలపాలెం -2 లేఅవుట్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా లేఅవుట్‌కు వెళ్లిన ఆయన అక్కడ నిర్మాణ పరిస్థితులను గమనించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్టేజ్ అప్డేషన్ పనులను రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని, ప్రతి రోజూ నివేదికను పంపించాలని సూచించారు. రోజువారీ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని పనులను పర్యవేక్షించాలని అధికారులకు చెప్పారు. తగినంత మంది సిబ్బందిని, కార్మికులను అందుబాటులో ఉంచుకోవాలని, పనుల్లో జాప్యం జరగకుండా చూసుకోవాలని గుత్తేదారులకు సూచించారు. లేఅవుట్లో తాజా పరిస్థితులను, నిర్మాణాల వివరాలను గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు, స్థానిక అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్

ఘనంగా సాంబమూర్తి పెళ్లిరాట మహోత్సవం

ప్రజాశక్తి-మునగపాక

స్థానిక సాంబమూర్తి స్వామి దేవస్థాన ప్రాంగణంలో పెళ్లిరాట మహోత్సవం ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. ఉసాంబమూర్తి స్వామి శు లాల మహోత్సవం కార్తీక మాసం రెండవ సోమవారం నిర్వహించనున్న సందర్భంగా ఈ పెళ్లి రాట వేయడం జరిగిందని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, గ్రామ పెద్దలు దాడి ముసిలి నాయుడు, మళ్ల సంజీవరావు, పెంట కోట సత్యనారాయణ, దాడి శివ, శరగడం జగన్, కమిటీ సభ్యులు అలంక సూర్య ప్రకాశరావు, బూడిద రామారావు, మా ఊరి సూరిబాబు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.102 కోట్లు కేటాయింపు

ప్రజాశక్తి - కె.కోటపాడు : పల్లె పండుగ వారోత్సవాల సందర్భంగా అనకాపల్లి జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం 102 కోట్ల రూపాయలు కేటాయించినట్లు పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరన్న నాయుడు తెలిపారు. మండలంలోని చౌడువాడలో పలు అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 1182 అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యేలు ఎంపీ శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. ఈ పనులన్నీ ఆగస్టు 23న గ్రామసభల్లో చేసిన తీర్మానాలు మేరకు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సిసి రోడ్లు, బిటి రోడ్లు, డ్రైన్లకు ఎక్కువగా నిధులు వెచ్చిస్తున్నట్లు ఇఇ చెప్పారు. చౌడువాడలో చేపట్టనున్న 19 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ఏఈ సుమతిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకనాయుడు, కార్యదర్శి సురేష్ బాబు, తనకల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగా ఛాంపియన్ నిర్మలకు ఎమ్మెల్యే అభినందనలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఛత్తీస్గఢ్ రాష్ట్రం బిలాయిలో ఇటీవల జరిగిన ఆలిండియా పోలీస్ యోగా ఛాంపియన్ షిప్‌లో కాంస్య పతకం సాధించిన అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎం.నిర్మలను బుధవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి పతకాలు సాధించాలని కోరారు. క్రీడాకారులకు తమ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

తాతయ్యబాబును కలిసిన మాజీ సైనికులు

ప్రజాశక్తి- బుచ్చయ్య పేట : ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబును రాష్ట్ర సైనికుల సెల్ కో కన్వీనర్, అనకాపల్లి సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అగ్గాల హనుమంతరావు, అనకాపల్లికి చెందిన మాజీ సైనికులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మాజీ సైనికులు కార్పొరేషన్ ఏర్పాటు చేసి జీఓ విడుదల చేయడం హర్షనీయమన్నారు. మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా సైనికులు వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి సూర్యప్రసాద్, సెక్రటరీ సందపర్తి వరప్రసాద్ పాల్గొన్నారు.

31న జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఈనెల 16 నుండి 31 వరకు గ్రామాల్లో గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందు ఇవ్వడం జరుగుతుందని పశువైద్య సహాయ సంచాలకులు దినేష్ కుమార్ తెలిపారు. కే కోటపాడు దేవరాపల్లి మండలాల్లో ఉన్న అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా నేరుగా జీవాల పెంపకం దారులకు ఈ మందును సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు. నట్టల నివారణ మందు ద్వారా జీవాలలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి పిల్లల్లో మరణాల రేటు తగ్గుతుందన్నారు. జీవాల శరీర బరువు పెరుగుదల ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మేకలు గొర్రెలు పెంపకం దారులు ఆయా గ్రామాల్లో ఉండే పశువైద్య సహాయకులను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం

ప్రజాశక్తి- కశింకోట

కసింకోట జాతీయ రహదారిపై బుధవారం తెల్ల వారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. కసింకోట సిఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలు ప్రకారం... నక్కపల్లి మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన కురం దాస్ ప్రతాప్ (30), బర్నికుల రాజేష్ (25) విశాఖపట్నం నుండి తమ గ్రామానికి బుధవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ సమయంలో కసింకోట జాతీయ రహదారిపై వారి ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కురం దాస్ ప్రతాప్, బర్నికుల రాజేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు ఇద్దరు స్నేహితులు. వృత్తి రీత్యా వీరిద్దరూ కార్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. విశాఖ వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై తమ స్వగ్రామం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఈ మేరకు కసింకోట సిఐ అల్లు స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతాప్, రాజేష్ (ఫైల్‌ఫొటోలు)

ఐటిడిఎ సేవలు వర్తిస్తాయి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఆదివాసీ గ్రామాలకు గతంలో వలే పాత జిల్లాల్లో ఉన్న ఐటీడీఏ పరిధి, సేవలు, ప్రాజెక్ట్ అధికారి అధికారాలు వర్తిస్తాయని ఎపి ఆదివాసీ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు మోసూరి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా ఉత్తరాంధ్రలోని, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏలను పార్వతీపురం కేంద్రంగా మన్యం జిల్లా, విశాఖపట్నం జిల్లా పాడేరు ఐటీడీఏ, తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం ఐటిడిఎ, మరికొన్ని ప్రాంతాలు కలిపి అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పాటైనట్లు పేర్కొన్నారు. దీంతో పాత జిల్లాలలో వుండిపోయిన ఆదివాసీ గ్రామాలు... ఉదాహరణకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుండి విడగొట్టబడి అనకాపల్లి జిల్లాలో వున్న దేవరాపల్లి, చీడికాడ, వి.మాడుగుల, రావికమతం, రోలుగుంట, గొలుగొండ, నాతవరం తదితర మండలాల్లోని ఆదివాసీ గ్రామాలకు పూర్వ వలే పాడేరు ఐటీడీఏ సేవలు వర్తిస్తూ ప్రాజెక్టు అధికారికి అధికారులు ఉన్నాయా? లేదా? అనే విషయమై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరుతూ ఈ ఏడాది ఆగస్టు 22న గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శికి పిఎస్ అజయ్ కుమార్ ఒక వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీనిపై మంత్రిత్వ శాఖ స్పందించి గత నెల 25న లేఖ రాస్తూ, కొత్త జిల్లాలకు ఐటీడీఏ పాలన కేంద్రాలు మారినా, ఉమ్మడి జిల్లాలుగా వున్నప్పుడు వున్న మండలాలూ అన్నీ ఐటీడీఏ పాలన పరిధిలో వున్నాయని గిరిజన సంక్షేమ శాఖ స్పష్టం చేసిందని తెలిపారు. ప్రభుత్వం ఈ విషయమై స్పష్టత ఇచ్చినందున కొత్త జిల్లాల ఏర్పాటుతో, పాత జిల్లాలలో మిగిలిపోయిన ఆదివాసీలు ఇక నుండి నిర్భయంగా ఐటిడిఎల వద్దకు తమ సమస్యలపై వెళ్ళవచ్చని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డిఎస్‌సి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎంపిక చేసిన ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ మూడు నెలలపాటు ఉంటుందని, https://jnanabhumi.ap.gov.in ఆన్లైన్ పోర్టల్‌లో దరఖాస్తు ఈ నెల 21 లోగా చేసుకోవాలని కోరారు. టెట్ అర్హత కలిగిన వారై, వార్షిక ఆదాయం రెండు లక్షల 50 వేల రూపాయలు లోపు ఉండి, ఆదాయపు పన్ను పరిధిలో లేకుండా, సొంత 4 చక్రాల వాహనాలు లేనివారై ఉండాలని పేర్కొన్నారు. కోచింగ్ ఎంపిక కోసం ఆన్లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ఈనెల 27న ఉంటుందన్నారు. ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాడు-నేడు పనుల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గోవాడ హైస్కూల్లో జరిగిన నాడు- నేడు పనుల్లో అవకతవకలు జరిగాయని, అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన జిల్లా కార్యదర్శి అల్లం రామ అప్పారావు డిమాండ్ చేశారు. 2022లో హైస్కూల్‌లో ఆరు అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని, ఇప్పటివరకు సుమారు రూ.58 లక్షలు పనులు జరిగాయని వాటిలో అధిక శాతం నిధులు దారి మళ్ళించారని పేర్కొన్నారు. ఈ అవినీతికి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కారణమన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, విద్యాశాఖ మంత్రి, డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ఎటువంటి అవకతవకలు జరగలేదు : హెచ్‌ఎం

ఈ విషయంపై హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.రాము మాట్లాడుతూ 2022- 24 వరకు హైస్కూల్లో అదనపు గదులు నిర్మాణం, రిపేరుకు రూ.57,81,110 నిధులు ఖర్చు చేశామని తెలిపారు. నిధులు ఖర్చుకు సంబంధించి స్కూల్ కమిటీతో పాటు గ్రామ సచివాలయ అధికారులతో 9 మందితో జాయింట్ అకౌంట్ ఉందని, ఖర్చు చేసినదంతా వారి సమక్షంలోనే జరిగిందని, ఎటువంటి అవకతవకలు జరగలేదని ఆయన తెలిపారు.

గ్రంథాలయంలో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని గణపర్తి శాఖ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సెక్రటరీ సిహెచ్ వెంకట్రావు బుధవారం సందర్శించారు. గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సూరిశెట్టి వెంకటరమణ గ్రంథాలయం పాత భవనంలో ఉండటం వలన పాఠకులకు ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డిజిటల్ లైబ్రరీ మధ్యలో ఆగిపోయి అసంపూర్తిగా ఉందని, దానిని త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సెక్రటరీ వెంకటరమణకు విజ్ఞప్తి చేశారు. అనంతరం అసంపూర్తిగా నిలిచిపోయిన ఆ స్థలాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అటెండర్ లంబా అప్పలనర్స, చదరం లోవ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-చోడవరం, చోడవరం రూరల్

రెండు నియోజక వర్గాల పేదలకు నిత్యం వైద్యం అందించే చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిని పట్టించుకోవాలని, వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్న వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆసుపత్రి పరిస్థితి అధ్వానంగా ఉందని నెల రోజులు క్రితం స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజుకు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఫిర్యాదు చేశామని, అయినా ఆసుపత్రి తీరు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 2 గంటలు దాటితే వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం లేదన్నారు. ఆసుపత్రిలో పని చేసే ఇద్దరు వైద్యులు స్థానికంగా ప్రైవేటు క్లినిక్‌లు పెట్టుకొని, ప్రభుత్వాసుపత్రిలో పేదల వైద్యాన్ని గాలికొదిలేస్తున్నారని విమర్శించారు. అంబులెన్స్, ఎక్స్‌రే ప్లాంట్ మూలకు చేరాయని, జనరేటర్ సౌకర్యం లేదని, దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎక్స్‌రే ప్లాంటు లేకపోవడంతో ఇక్కడి టెక్నీషియన్‌ను డిప్యూటేషన్‌పై పెందుర్తి బదిలీ చేశారని తెలిపారు. ఈ ఆసుపత్రిలో ఎన్నో ఏళ్ల నుండి ఉన్న పోస్టుమార్టం గది శిథిలావస్థకు చేరడంతో దానికి మరమ్మతులు చేయకుండా, పోస్టుమార్టం సేవలు రద్దు చేశారని పేర్కొన్నారు. దీని వల్ల మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలిస్తుండడంతో బాధిత బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చోడవరం ప్రభుత్వాసుపత్రిపై దృష్టి సారించి పై సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న చోడవరం ఎంపిడిఓ ఆంజనేయులు

పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులకు శిక్షణ తరగతులను స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.పద్మజ మాట్లాడుతూ పంచాయితీల అభివృద్ధి వార్డు సభ్యులపై ఆధారపడి ఉందన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు నిర్వహణ, పంచాయతీల ఆస్తుల పరిరక్షణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాస్, ఈఓపిఆర్‌డి చైతన్య పాల్గొన్నారు.

చోడవరం : రాష్ట్రీయ గ్రామీణ సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పంచాయితీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి ఆంజనేయులు మాట్లాడుతూ పంచాయితీ పాలకవర్గం కలసికట్టుగా నిర్ణయాలు తీసుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి వర్రి మహేష్, చోడవరం పంచాయతీ ఈవో నారాయణ రావు, పలు గ్రామాలకు చెందిన ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండల కేంద్రంలో బుధవారం సమావేశ మందిరంలో గ్రామ వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి గ్రామ, వార్డుస్థాయి నాయకులు సహకరించాలని, ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణతో అభ్యసన సమస్యలను అధిగమించవచ్చు

ర్యాలీ నిర్వహిస్తున్న పరవాడ భవిత కేంద్రం విద్యార్థులు

ప్రజాశక్తి-పరవాడ

నిర్దిష్ట అభ్యసన వైకల్యాలు ఉన్న ప్రత్యేక అవసరాలు పిల్లలకు ప్రత్యేక తర్ఫీదును ఇవ్వటం వలన వారిలో అభ్యసన సమస్యలను అధిగమించవచ్చని మండల విద్యాశాఖ అధికారి -1 ఎం.దివాకర్ అన్నారు. పరవాడ మండలం భవిత సెంటర్లో రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి వారి ఆదేశాల మేరకు ఎంఈఓ దివాకర్ అధ్యక్షతన బుధవారం "డిస్ లెక్సియా ఫర్ వాక్" అనే అవగాహన కార్యక్రమం నిర్వహించచారు. ఈ సందర్భంగా ఎంఇఒ దివాకర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన అన్నిరకాల సేవలు సదుపాయాలను కల్పించడం జరుగుతుందని చెప్పారు. ప్రత్యేక ఉపాధ్యాయులు టి.కుమారి మాట్లాడుతూ వికలాంగుల చట్టం 2016 ప్రకారం ఉన్న 21 రకాల వైకల్యాల్లో నిర్దిష్ట అభ్యసన వైకల్యం అనేది ఒకటి. ప్రభుత్వం వీరికి మిగిలిన వైకల్యం గల విద్యార్థుల వలె వీరికి కూడా స్కాలర్‌షిప్‌లు, అలవెన్స్‌లతో పాటు 10వ తరగతి పరీక్షలలో మార్కుల మినహాయింపు కూడా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థులు డిస్ లెక్సియా ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి శ్రీనివాసరావు, వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అభ్యాసన వైకల్యం గల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించవలసి ఉంటుందని భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయురాలు యేసు రత్నం తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామం కొండ కొప్పాక ప్రత్యేక అవసరాలు గల పిల్లల భవిత కేంద్రం విద్యార్థులతో బుధవారం డిస్సిలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిస్లేరియా విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించగలరని, సామాజిక మద్దతు, విద్యాపరమైన అందుబాటులో అవసరం ఉందని చెప్పారు. 8 సంవత్సరాల లోపు పిల్లల్లో గుర్తించినట్లయితే వారికి ఎక్కువగా అభ్యాసన ప్రక్రియల ద్వారా సరి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు సిహెచ్ రమాదేవి, కొప్పాక ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని చిన్నప్పన్నపాలెం గ్రామంలో నిర్మించిన పైడితల్లమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు బుధవారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-తగరపువలస

మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన బుధవారం భీమిలి మండలంలోని దాకమర్రి, మజ్జివలస గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. భీమిలి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బి.విజయప్రసాద్ మాట్లాడుతూ, కొత్త రాగి వంగడాలను నాటే పద్ధతిలో మెళకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులతో పాటు గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులకు సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు చదువుల సుబ్రమణ్యం మాట్లాడుతూ, సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో కలిసి వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ఎఒ బి.శివకోమలి, మార్కెట్ కమిటీ నుంచి మీరాభాయి, రైతు సేవా కేంద్రం సిబ్బంది భాగ్య రేఖ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచారంపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాధికారి సోమశేఖర్ అన్నారు. మండలంలోని కె.కోటపాడు, గుల్లేపల్లి గ్రామాల్లో బుధవారం పొలంబడి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రకృతి సేంద్రియ వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో మేలైన నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని చెప్పారు. గుల్లేపల్లి లో రైతులు మొక్కజొన్న పంటను వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు ఎర్రంశెట్టి భవాని, బండారు దేముళ్ళు, పైలా అమ్మాజీ, పైల గంగు నాయుడు, గొల్లేపల్లి ఎంపీటీసీ కసిరెడ్డి దేముడు బాబు, రాళ్లపల్లి శ్రీరామమూర్తి, గొర్లె శంకర్రావు వ్యవసాయ విస్తారనాధికారి లైలా దేవి పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఏనుగు తుని, నూతలగుంటపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం జరిగింది. వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.రామారావు రైతులతో కలిసి పొలాల్లోకి వెళ్లి వరి, చెరుకు పంటలను పరిశీలించి తెల్లచిత్త, పొడ తెగులు, దోమకాటు, ఇతర తెగుళ్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎం స్వప్న, విఏఏ మధు, గొంతిన చిరంజీవి, సర్పంచ్ నాగమణి, ఏ.చంద్రరావు, ఎన్.నూకరాజు, ఎన్. మోహన్, రైతులు పాల్గొన్నారు.

కారిడార్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములకు సంబంధించి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు బుధవారం తహసిల్దార్ నరసింహామూర్తి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. నిర్వాసితులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలని, పరిశ్రమల ఏర్పాటుకు భూములు స్వాధీనం చేసుకునే నాటిని కటాఫ్ తేదీగా పరిగణించి అప్పటికి 18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరికి రూ.15 లక్షలు, ఇల్లులు కోల్పోతున్న కుటుంబంలో 18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరికి 25 లక్షలు ప్యాకేజీ చెల్లించాలని కోరారు. గ్రామంలో ఇల్లలు కోల్పోయిన ప్రతి ఒక్కరికి 10 సెంట్లు ఇంటి స్థలం, మెరుగైన పునరావాసం తాము కోరిన చోట ఇవ్వాలని, నిర్వాసితులందరికీ ఆర్ కార్డులు ఇవ్వాలని కోరారు. గ్రామంలో వివిధ సర్వే నెంబర్లలో 247.13 ఎకరాలు భూమిలో నిరుపేదలైన తామంతా పూర్వం నుండి కొబ్బరి, జీడి, మామిడి మొక్కలు వేసుకుని వచ్చిన ఫలం సాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నామని తెలిపారు. ఈ భూములు ఫారెస్ట్ భూములను చెప్పి, పరిహారం చెల్లించలేదని దీంతో తామంతా తీవ్రంగా నష్టపోతున్నామని, తమకు న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న సాగు, డీ పట్టా భూములకు, మొక్కలకు పరిహారం చెల్లించాలన్నారు. రాజయ్యపేట, బోయపాడు గ్రామాలకు చెందిన తామంతా సముద్రాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తూ, చేపల వేట చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని ఫిషింగ్ జెట్టి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇప్పటికే చందనాడ రెవెన్యూ పరిధిలో ఫిషింగ్ జెట్టి నిర్మాణానికి 6 ఎకరాలు స్థలం అధికారులు గుర్తించడం జరిగిందన్నారు. తమ జీవనోపాధిని దృష్టిలో పెట్టుకొని వెంటనే ఫిషింగ్ జెట్టి నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, మత్స్యకార నాయకులు పిక్కి కోదండరావు, మడదా రాంబాబు, కారే తాతాజీ, శ్రీనివాసరావు, కాశి, నూకరాజు, భూలోక, తదితరులు పాల్గొన్నారు. బుచ్చిరాజుపేట లో జరిగిన గ్రామసభలో సర్పంచ్ కాళ్ళ శ్రీనివాస్, నిర్వాసితులతో కలిసి తహసిల్దార్ నరసింహమూర్తికు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మాట్లాడుతున్న సిఇఒ

సకాలంలో రుణాలు చెల్లించాలి

ప్రజాశక్తి -చీడికాడ:మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అఫీషియల్ ఇన్చార్జి కె రమారత్నం, సీఈఓ మజ్జి వరహాల దొర ఆధ్వర్యంలో మహాజన సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఫీషియల్ ఇంచార్జ్ మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ జరుగుతున్న తరుణంలో సభ్యులందరూ కెవైసీ నిమిత్తం సంబంధిత ఆధార్, ధ్రువపత్రములను అందజేయాలని ఆమె తెలిపారు. రైతులందరూ కూడా సకాలంలో రుణాలు చెల్లించి ప్రభుత్వం అందించే ప్రతిఫలాలను పొందాలని ఆమె తెలిపారు. సీఈవో వరహాల దొర మాట్లాడుతూ,ఈ సభలో ఆరు నెలల ఆర్థిక లావాదేవీలను చదివి వినిపించడంతోపాటు లావాదేవీలన్నీ కూడా సక్రమంగా ఉన్నట్లు ఆమోదించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరచా నారాయణమూర్తి, సిబ్బంది తాతం నాయుడు, వరహాలమ్మ, త్రినాద్, మహాలక్ష్మి నాయుడు, శ్రీరామ్ మూర్తి పాల్గొన్నారు.

సత్కరిస్తున్న శివదత్, నాయకులు

తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి -నక్కపల్లి:ఇటీవల తహసిల్దార్గా బాధ్యతలు చేపట్టిన నరసింహామూర్తిని బుధవారం జనసేన పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్, ఎంపీటీసీ సభ్యులు అకేటి గోవిందరావు, పార్టీ నాయకులు కురందాసు అప్పలరాజు, పాము గణేష్, మైలపల్లి గిరీష్, జగన్, రాజా, రాజు బంగారి, పిక్కి గోవింద్, వెంకట రమణ, కందాల నాగరాజు, పిక్కి మహేష్ తదితరులు తహసిల్దార్ నరసింహామూర్తిని శాలువాతో సత్కరించారు.

గృహ నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: పీఎం జన్మన్ గృహ నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి బాబు నాయక్ చెప్పారు. బుధవారం అంత్రిగుడ పివిటిజి గ్రామంలో సందర్శించిన ఆయన పీఎం జన్మన్ గృహ నిర్మాణ పథకంపై పిపిటిజి గిరిజనులకు అవగాహన కల్పించి శంకుస్థాపన చేశారు.

నేటి నుండి రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి-నక్కపల్లి:జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నక్కపల్లి మండలంలో భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 17వ తేదీ నుండి వచ్చే నెల నవంబర్ 5వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసిల్దార్ నరసింహమూర్తి వెల్లడించారు. 17న రమణయ్యపేట, 18 సిహెచ్‌బి అగ్రహారం, 19 న్యాయంపూడి, 21 జి.జగన్నాధపురం, 22 రాజయ్యపేట, 23 బుచ్చిరాజుపేట, 24 చందనాడ, 25 నల్లమట్టి పాలెం, 26 గునుపూడి, 28 ఎన్.నరసాపురం, 29 గొడిచర్ల, 30 ముకుందరాజుపేట, నవంబర్ 1న బోదిగల్లం, 2 దోసలపాడు, 4 కాగిత, 5న డొంకాడ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నామని తహసిల్దార్ తెలిపారు. గ్రామాల్లో జరగనున్న గ్రామసభలకు రైతులు హాజరై, రెవెన్యూ పరమైన సమస్యలు ఏమైనా ఉంటే దరఖాస్తు రూపంలో తెలియజేస్తే, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సమస్యలు పరిష్కారం చేపడతామన్నారు. రైతులు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోటవురట్ల: రీ సర్వేలో తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. బుధవారం తహసిల్దార్ తిరుమలరావు రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామసభలపై షెడ్యూల్ విడుదల చేశారు.రీ 17న సంకపూర్, 18న రాజుపేట, 19న పి రామన్నపాలెం, 21న జల్లూరు, 22న ఎండపల్లి, 23న అన్నవరం, 24న చౌడువాడ, 25న లింగాపురం, 26న తంగేడు, 28న కోటవురట్ల, కేబీ అగ్రహారం, 29న బికేపల్లి, రామచంద్రపాలెంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉపతహసిల్దార్ రమేష్, ఆర్ఐ ఊర్ధవరావు, మండల సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కశింకోట కశింకోట మండలంలో భూములు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని మండల తహశీల్దారు అడబాల శ్రీనువాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 27 రెవెన్యూ గ్రామాలకు 25 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, రీసర్వేతో నష్టపోయిన రైతులు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించనున్నామని చెప్పారు. 17న కొత్తపల్లి గ్రామంలో ప్రారంభమవుతుందని చెప్పారు.

చోడవరం : 17 నుండి నెలరోజులపాటు మండలంలో భూ సమస్యలపై గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహశీల్దారు ఎ.రామారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూ సమస్యలపై నెలరోజుల పాటు ఫిర్యాదులు స్వీకరించి తమ పరిధిలో ఉన్న సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిటి పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని భూ రీసర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాలలో భూ సమస్యలపై ఈనెల 17 నుండి రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు స్థానిక తహశీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రీ సర్వేలో భూమి విస్తీర్ణం తక్కువ నమోదైనా, పేర్లు తప్పు పడినా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులు 17న విప్పాక అగ్రహారం, 18న పైడివాడ, 19న ఆసకపల్లి, 21న ఎరుకు నాయుడుపాలెం, 22న చింతగట్ల అగ్రహారం, 23న గొట్టివాడ, 24న గాలి భీమవరం, 25న లగిశెట్టి పాలెం, 26న రాయపుర అగ్రహారం, 28న బంగారమ్మ పాలెం, 29న ఎ.సిరసపల్లి, 30న సబ్బవరం, నవంబర్ 1న అయ్యన్నపాలెం, 2న బోదువలస, 5న ఎల్లుప్పి, 6న మొగలిపురం, 7న నారపాడు, 8న టెక్కలిపాలెం, 9న ఇరువాడ, 11న పైడివాడ అగ్రహారంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇసుక స్టాక్ పాయింట్‌ను పున:ప్రారంభించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటి వరకు ఇసుక స్టాక్ పాయింట్ తెరవక పోవడం తో భవన నిర్మాణ కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కిలాడి రామకృష్ణ తెలిపారు. . బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నాలుగు నెలలుగా ఇసుక కొరతతో నానా ఇబ్బందులు పడుతున్నామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 115 రోజులు అవుతున్నా డిపోలో ఉన్న ఇసుకను విక్రయించలేదన్నారు. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయని అన్నారు. ప్రైవేటు వ్యక్తులు నదుల్లో సేకరించిన ఇసుకను అధిక ధరకు అమ్ముతున్నారని, దీంతో నిర్మాణదారులు కొనేందుకు వెనకాడుతున్నారని ఇప్పటికైనా కూటమి నాయకులు ఇసుక స్టాక్ పాయింట్ ను తెరిస్తే సామాన్యులకు మేలు చేసినట్టవుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పాత డిపోను పున్ణప్రారంభించి, ఇసుక దోపిడిని అరికట్టాలన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న సిఐ రామకృష్ణ

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సిఐ

ప్రజాశక్తి -కోటవురట్ల:సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి పెట్టాలని నక్కపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ సూచించారు. బుధవారం బాధ్యతలు తీసుకున్న ఆయన కోటవురట్ల పోలీస్ స్టేషన్ సందర్శించి సిబ్బందిని పరిచయం చేసుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాలలో సమస్యాత్మక ప్రాంతాలలో సిబ్బంది స్నేహపూర్వక వాతావరణం కల్పించే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమ మద్యం, సారా అమ్మకాల పట్ల నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అక్రమ ఇసుక, గ్రావెల్ తవ్వకాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె పండగ గ్రామసభలు

నక్కపల్లి మండలంలో శంకుస్థాపన చేస్తున్న నేతలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని బుధవారం దేవవరం, గొడిచర్ల, చీడిక, ముకుందరాజుపేట, దోసలపాడు, రేబాక గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్లు, ఎంపీడీవో డి.సీతారామరాజు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, వైజోయిన రమణ, అధికారులు పాల్గొన్నారు.

కోటవురట్ల:పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా బుధవారం లింగాపురం, జల్లూరు, సుంకపూర్, ఎండపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జానికి శ్రీను, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, పిఆర్ జెఈ వర్మ, ఏపీవో నాగరాజు, ఆయా గ్రామాల సర్పంచ్ ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం గ్రామాల్లో పల్లె పండగ గ్రామసభలు బుధవారం నిర్వహించారు. తాళ్ళపాలెం జరిగిన కార్యక్రమంలో టిడిపి కూటిమి నాయకులు గొంతిని శ్రీనివాసరావు, నైనముశెట్టి రమణరావు, ఉల్లింగల రమేష్, కర్రి సత్య నారాయణ, కర్రి గోవిందా, బలిజ ముసిలి నాయుడు, వార్డు సభ్యులు కర్రి లోవ రాజు, అప్పి కొండ అప్పారావు, ఎంపిడిఓ రవి కుమార్, తహశీల్దారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలో రూ.1.65 కోట్ల విలువైన పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. గంభీరం పంచాయతీలో ఎస్ఆర్.కాలేజీ నుంచి ఐఐఎం వరకు రూ.30 లక్షలతో బీటీ రోడ్డు, శ్రీలక్ష్మి బ్రిక్ ఇండస్ట్రీ నుంచి ఎస్ఆర్ కాలేజీ వరకు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, వేములవలస సచివాలయ భవనం నుంచి ఐఎంఎఫ్ఎల్ లిక్కర్ డిపో వరకు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, బోని రోడ్డు నుంచి ఎల్వి.పాలెం మీదుగా ఆనందపురం మండల కార్యాలయం వరకూ రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, పైడితలమ్మ ఆలయం నుంచి తర్లువాడ వరకూ రూ.15 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. పల్లె పండుగలో భాగంగా ఈ పనులకు శంకుస్థాపనలు జరిపారు. కూటమి నాయకులు కోరాడ రాజబాబు, రామానాయుడు, గంభీరం సర్పంచ్ వానపల్లి లక్ష్మి, వేములవలస ఉప సర్పంచ్ నవీన్, నాయకులు బమ్మిడి సూర్యనారాయణ, బంగారు నాయుడు, అప్పలరాజు, బిఆర్‌బి.నాయుడు, తాత్రాజు అప్పారావు, సారికి విజయ్, చందకుమారి తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

నిరసన చేపడుతున్న మహిళలు

తాగునీటి సమస్యపై మహిళల నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ రావికమతం మండలం కొమిర గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఖాళీ బిందెలతో బుధవారం స్థానిక సచివాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు బురిగా రేణుక, తోకల పెరమ్మ, తోకల లక్ష్మి తదితరులు మాట్లాడుతూ, గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి తాగు నీటి కుళాయిలు వేశారని,తమ ఏరియా ఎగువ ప్రాంతం కావడంతో తాగు నీరు సరఫరా కాలేదన్నారు. దీంతో గత కొన్నాళ్ళు గా తాగు నీటికి నానా అవస్థలు పడుతున్నామని మహిళలు వాపోయారు. తక్షణమే తాగు నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె. గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గణేష్

ఇసుకను ఉచితంగా అందించాలి

-మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ప్రజలకు, భవన కార్మికులకు కూటమి ప్రభుత్వం వెంటనే ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన వైఎస్సార్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వైసిపి నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ఇసుకను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. 5000 మంది భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు మూడు నెలల నుంచి పస్తులు ఉంటున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు ఇసుకను సరఫరా చేయాలని కోరారు. ఈనెల 21న చేపడుతున్న శాంతి ర్యాలీకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భవన కార్మికులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ సీనియర్ నాయకులు రుత్తల ఎర్రాపాత్రుడు, డాక్టర్ లక్ష్మీకాంత్, మున్సిపాలిటీ నాయకులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టు - హెచ్ఎస్ఎల్ మధ్య ఒప్పందం

బొలార్డ్ పుల్‌టగ్‌ను అందించేందుకు షిప్‌యార్డు అంగీకారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు, హిందుస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ కాంట్రాక్టు ఒప్పందంపై బుధవారం సంతకాలు జరిగాయి. పోర్ట్ డిప్యూటీ కన్జర్వేటర్ కెప్టెన్ టి.శ్రీనివాస్, హిందుస్థాన్ షిప్ యార్డ్ డైరెక్టర్ కమాండర్ గిరిదీప్ సింగ్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా 60 టన్నుల సామర్థ్యం కలిగిన బొలార్డ్ పుల్‌టగ్‌ను హిందూస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ నిర్మించి పోర్టుకు అందించనుంది. అందుకోసం ఒప్పంద తేదీ నుంచి 18 నెలల సమయం పడుతుంది. ఈ టగ్‌ను అత్యాధునిక సాంకేతికతతో, భద్రతా ప్రమాణాలను అనుసరించి రూపొందించనున్నారు. పోర్ట్ హార్బర్‌లో నౌకల నిరంతర కదలికలను సులభతరం చేయడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది. రాబోయే రోజుల్లో కార్గో ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచడంలో సహాయపడుతుందని పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ ఒక ప్రకటన లో తెలిపారు.

అన్ని జిల్లాలకు నిధులిచ్చి అల్లూరి జిల్లాను ఎందుకు విస్మరించారు?

అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:రాష్ట్రంలో 26 జిల్లాలు ఉండగా, 25 జిల్లాలకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గిరిజనులు నివసిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు నిధులు కేటాయించక పోవడం ఆశ్చర్యంగా ఉందని అనంతగిరి సిపిఎం జెడ్పీటిసి దీసరి గంగరాజు అన్నారు. బుధవారం టోకూరు సర్పంచ్ కిలో మోస్యతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 23న మన పంచాయతీ, మన సాధికారత గ్రామ సభల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల అధికారులు, నోడల్ బృందాలతో అన్ని పంచాయతీ కేంద్రాల వద్ద ప్రజల సమక్షంలో బహిరంగ గ్రామసభలు ఏర్పాటు చేసి, పనులు గుర్తించి ఎసిమేట్లు వేసి నిధులు విడుదలకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. దానిని అనుసరించి అల్లూరి సీతారామరాజు జిల్లాను తప్పించి 25 జిల్లాలకు రూ.2,712.50 కోట్లను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి విడుదల చేసిందన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఈ ప్రకటన చేశారన్నారు. ఈ నేపథ్యంలో నిధులు విడుదల కావడంతో అన్ని జిల్లాలలో పనులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని తెలిపారు. ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాకు మాత్రం నిధులు కేటాయించకుండా, గిరిజనులకు గిరిజన ప్రాంతంలో అభివృద్ధి జరగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి జిల్లా నుండి విడిపోయి పేదరికంలో కొట్టు మిట్టాడుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు నిధులు కేటాయించకుండా గిరిజనులకు అన్యాయం చేశారని ఆవేదన వెలిబుచ్చారు. గిరిజనుల హక్కులు, చట్టాలపై దాడి చేస్తూ, నూటికి నూరు శాతం గిరిజనులకు ఉద్యోగాలు ఇచ్చే జివో 3 ను రద్దు చేశారన్నారు. 1/70 చట్టాన్ని, పీసా చట్టాన్ని ఉల్లంఘించి, గిరిజన ప్రాంతంలో గిరిజనులకు రక్షణ లేకుండా చేస్తూనే, మరోపక్క నూటికి నూరు శాతం గిరిజనులు ఉన్న జిల్లా నే టార్గెట్ గా చేసి నిధులు కేటాయించకుండా కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి నాయకులు గత ప్రభుత్వంలో మంజూరైన నిధులకు

మాట్లాడుతున్న గంగరాజు

శంకుస్థాపనలు, కొబ్బరికాయలు కొట్టడం కాకుండా, నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నేటికీ సరైన రోడ్డు సౌకర్యం లేక, జ్వరాల బారిన పడినప్పుడు డోలీతో ఆసుపత్రికి తీసుకు వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించకపోతే నిలదీస్తామని హెచ్చరించారు.

భూ నిర్వాసితుల హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మాకవరపాలెంలో కంపెనీ ఏర్పాటుతో భూముల కోల్పోయిన భూ నిర్వాసితుల కుటుంబాలను ఆదుకోవాలని, వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏవో సూర్యనారాయణకు భూ నిర్వాసితుల సంక్షేమ సంఘం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసేకరణ సమయంలో ప్రభుత్వ అధికారులు, పయనీర్ (ఆన్‌రాక్) అల్యూమినియం కంపెనీ యాజమాన్యం భూనిర్వాసితులకు, పునరావాసులకు చేతు వృత్తుల వారికి ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. భూసేకరణ చేసిన సమయం నుంచి నేటి వరకు జరిగిన పలు విషయాలపై బహిరంగ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. మాకవరపాలెం మండలంలో కోడూరు, రాచపల్లి గ్రామ సమీపంలో ప్రభుత్వ అటవీ భూమి అభివృద్ధి చేయడానికి వన సంరక్షణ సమితి సభ్యులుగా భూ నిర్వాసితులను పునరావాసులను, చేతి వృత్తుల వారిని భాగస్వామ్యం చేసి అభివృద్ధి చేయగా వచ్చిన ఆదాయంతో ఉపాధి కల్పిస్తామన్నారన్నారు. ప్రతి ఇంటికి ఒకరికి కంపెనీలో ఉద్యోగం, భూ నిర్వాసితులందరికీ రెండు సెంట్లు భూమి, పాడి పశువులకు ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. భూనిర్వాసితులు, పునరావాసులకు అర్హులైన వారికి ఇంతవరకు

వినతిపత్రం ఇస్తున్న సంఘం నేతలు

ఇళ్ళ స్థలాలు ఇవ్వలేదన్నారు. భూసేకరణ సమయంలో కోట్ల రూపాయలు విలువగల ప్రభుత్వ భూములను కబ్జాలకు పాల్పడ్డారని, రైతుల భూమి బినామీ పేర్లతో భూసేకరణలో కోట్లాది రూపాయల కుంభకోణానికి పాల్పడి అర్హులైనవారికి రైతులకు నష్టపరిహారాలు, ప్యాకేజీలు రాకుండా అనేక ఆరాచకాలకు పాల్పడిన (ఆన్ రాక్) పయనీర్ అల్యూమినియం కంపెనీ యాజమాన్యం బినామీ దారులు, పెత్తందారులపై బహిరంగ విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి నాయకులు రుత్తల యర్రాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

మాట్లాడుతున్న విజయ్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: వంద రోజుల కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నా ఆశ కలిగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. టిడిపి క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నం నియోజకవర్గంలో గత ఐదు సంవత్సరాల కాలంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎన్నికల సమీపిస్తున్న నెల రోజుల ముందు నాణ్యతలేని పనులు చేసి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో 2300 కోట్ల రూపాయలు అయ్యన్నపాత్రుడు నియోజకవర్గానికి తెచ్చి అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. నర్సీపట్నంలో ఆర్ అండ్ బి శాఖ అనుమతి లేకుండా బూడిదతో నాణ్యత లేని రోడ్డు పనులు చేపట్టారన్నారు. అయ్యన్నపాత్రుడు నాయకత్వంలో నాలుగు నెలల్లో నియోజక వర్గానికి సుమారు 17.05 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు తెచ్చామని ఆయన పేర్కొన్నారు. 14.36 కోట్ల రూపాయలు సిసి రోడ్ల నిర్మాణం కోసం తీసుకురావడం జరిగిందని తెలిపారు. తాండవ, రావణాపల్లి రిజర్వాయర్ గేట్ల మరమ్మతులు, ఇతర ఇరిగేషన్ పనులకు కోటి 32 లక్షలు మంజూరు చేసారన్నారు. కృష్ణదేవిపేట ప్రధాన రహదారి వద్ద కల్వర్ట్ నిర్మాణానికి 43 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వర్షాలకు నష్టపోయిన రహదారులు, కల్వర్టులకు 96 లక్షల గ్రాంట్ పొందడం జరిగిందని పేర్కొన్నారు. నర్సీపట్నం ప్రభుత్వాసుపత్రిని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.గబ్బడ ఇసుక పాయింట్లో ఇసుక దొంగ ఎవరనేది విచారణ జరిగి త్వరలో నిజాలు బయటకు వస్తాయని చెప్పారు. ప్రజల ఇబ్బందులను తొలగించి, త్వరలో ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ఈ సమావేశంలో కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు, రవి వర్మ, చింటూ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ సెక్టార్ అథ్లెటిక్స్‌లో మీనా కుమారి సత్తా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డెహ్రాడూన్‌లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ అథ్లెటిక్స్ పోటీలలో బిఎస్ఎన్ఎల్ విశాఖ జిల్లాకు చెందిన మీనా కుమారి సత్తా చాటారు. రెండు ఈవెంట్లలో ఆమె ద్వితీయ స్థానంలో నిలిచి పతకాలు సాధించారని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి పిఇపిహెచ్‌వి.సాగర్ మీడియాకు తెలిపారు. మీనా కుమారి 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, అలాగే లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించారని వెల్లడించారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ మహిళా విభాగం కార్యదర్శిగా ఉన్న మీనా కుమారి జాతీయ స్థాయిలో ఇటువంటి ప్రతిభను కనపరచడం హర్షించదగిన విషయమని, తమ యూనియన్‌కు ఎంతో గర్వకారణమని అన్నారు.

1298వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 1298వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు కంచరపాలెం జోన్ అధ్యక్షులు ఒమ్మి అప్పారావు, నాయకులు ఎం.ఈశ్వరరావు, కె.లక్ష్మణరావు, వి.వరప్రసాద్, బి.గంగరాజు పాల్గొన్నారు.

నర్సుల సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపి ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం కెజిహెచ్ క్లాక్ రూమ్‌లో కోలాహలంగా చేపట్టిన కార్యక్రమంలో నామినేషన్లను అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారి బి.శ్రీనివాసరావు స్వీకరించారు. మొత్తం ఓటర్లు 555కాగా అందులో ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత ఉన్నవారు 25 మంది కెజిహెచ్‌లో ఉన్నారు. ఈ ఎన్నికలలో రెండు ప్యానెల్స్ పోటీలో ఉన్నాయి. తొలిసారి అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, ఉపాధ్యక్ష పదవితో పాటు ఐదుగురు పాలకవర్గ సభ్యులను సైతం ఎన్నుకోవాల్సి ఉంటుంది. గురువారం నామినేషన్ల పరిశీలన, శుక్రవారం ఉపసంహరణ ఉంటాయని, ఈ నెల 23న ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారి తెలిపారు. కార్యదర్శి పదవికి 3 నామినేషన్లు వచ్చాయని, మిగిలిన అన్ని పోస్టులకు రెండేసి చొప్పున నామినేషన్లు వచ్చాయని, మొత్తం 19 నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు.